# దగా

*ఇంటిముందు మారుతికారు ఆగడంతో ఆశ్చర్యంగా బయటకు వచ్చి చూసింది శ్రీలత. అప్పటికే ఇంటిచుట్టుపక్కల వాళ్ళు కారువైపు వింతగా చూస్తున్నారు. దారివెంటవెళ్ళేవారు కారు చుట్టూ గుమిగూడారు. వారు అలా వింతగా ఆశ్చర్యంగా చూడడానికి కారణం ఇంతకుముందు అలాంటి కారును చూడకపోవడం కాదు. తమతో తిరిగే ఒకవ్యక్తి హఠాత్తుగా అలా కారులో రావడమే!*

కారులోనుండి ఠీవిగా కిందికిదిగి డ్రైవర్‌తో ఏదో మాట్లాడి చేయిఊపాడు సత్యం. దుమ్ము లేపుకుంటూ కారు వెళ్ళిపోయింది. చుట్టూ మూగిన జనంవైపు, ఇండ్లల్లోంచి తొంగి చూస్తున్నవారివైపు గర్వంగా అతడి చేతిలోని బ్రీఫ్‌కేస్ అందుకుని లోపలికి వెళ్ళింది శ్రీలత.

"బొంబాయి నుండి కారులోనే వచ్చినవా సత్తన్నా" ఆసక్తిగా అడిగాడొకవ్యక్తి. చిన్నగా నవ్వుతూ అవునన్నట్టు తలూపాడు. సత్యం గుమికూడిన వ్యక్తుల్లో కొందరు తమదారిన తాము వెళ్ళిపోయారు. మరికొందరు మాత్రం సత్యంతో ఇంట్లోకివెళ్ళారు.

"మొన్న తోలుకపోయినోళ్ళందరు ప్లేన్ ఎక్కిండ్రా" ఇంట్లోకి వెళ్ళాక సత్యంని అడిగాడొక వ్యక్తి ఉత్సాహంగా.

"మొన్ననే ఎక్కిచ్చిన. నాది మాటంటే మాటే. అయితే అయితదని చెబుత. కాకపోతే కాదని చెబుత. కొందరు ఏజంట్‌లు పాస్‌పోర్ట్, పైసలు తీసుకుని యాడాదులు తింపుతరు. నేను ఫ్లైట్ ఎక్కిచ్చినంకనే పైసలు తీసుకుంట." కుర్చీలో  కూర్చొని రిలాక్స్‌డ్‌గా వాలిపోతూ చెప్పాడు సత్యం.

"మన ఊరినుండి పోయిన పదిమంది ఒక్కటే కంపెనీకి వెళ్ళారా? వేరు వేరు కంపెనీలకు వెళ్ళారా....?" ఇంతకు ముందు వ్యక్తి మళ్ళీ అడిగాడు ఆరాతీస్తున్నట్టు.

సత్యం ఒకసారి అతడివైపు నవ్వుతూ చూసి అందరిలో ఉత్సుకతను రేకెత్తిస్తున్నట్టు చెప్పడం మొదలెట్టాడు. "పదిమంది గాదు తమ్మీ యాభైమందినైనా సరే! ఒక్కటే కంపెనీకి పంపిస్త. మస్కట్‌ల కొత్తగ మొదలయింది మున్సిపాలిటి పని. చాలామంది అవసరమున్నది. ఇప్పుడు వెళ్ళేవారుంటే పదిరోజుల్లో విజా రెడీ చేసి తీసుకువస్త. మున్సిపాలిటీపని. అలుకగ ఉంటది. జీతం బాగుంటది. ఎనిమిది గంటల డ్యూటీ. తర్వాత మనకు ఓపిక ఉన్నంత ఓ.టి. చేసుకోవచ్చు.

భర్త మాటల్ని వింటూ మౌనంగా నిలబడింది శ్రీలత. తన మాటలు యువకుల్లో ఆశను రేకెత్తించాయని గమనించాడు సత్యం. మరింత ఉత్సాహంగా చెప్పడం మొదలెట్టాడు.

"మన తెలంగాణా దిక్కు ధైర్యం చెయ్యరు తమ్మీ! అరవై వేయిలంటేనే భయపడుతరు. అదే ఆంధ్ర దిక్కు అయితే తొంభై వేయిలు ఖర్చయినా భయపడరు. ఒక సంవత్సరంలో మిత్తి అసలు తీర్చేస్తరు. మరో  సంవత్సరం ఉండి లక్షరూపాయలు తెచ్చుకుంటరు. ఇక్కడ రెండేండ్లు కూలీనాలీ, వ్యవసాయం చేసినా పదివేలరూపాయలు సంపాదించము!"

అతడి మాటలు వారి మీద బాగా పనిచేసాయి. మస్కట్ వెళ్దామంటే అడ్డుపడి వారించినా తను పెద్దలను తిట్టుకున్నారు. పాస్‌పోర్ట్ లేనివారు పాస్‌పోర్ట్‌లను తియ్యాలని, ఉన్నవారు వాటిని సత్యంకు ఇయ్యాలని గట్టిగా నిర్ణయించుకున్నారు. వారం రోజుల్లో ఇంకొక బ్యాచ్‌ను తయారుచేసి తోలిస్తానని వారికి హామీ ఇచ్చాడు సత్యం. అందరూ వెళ్ళిపోయాక టీకప్పుతో భర్త వద్దకు వచ్చింది శ్రీలత.

టీ ని అతడికి అందించిఏదో చెప్పబోతుండగా, ఆడ, మగ, పిల్లలూ అంతా కలిసి ఇరవై మందికి పైనే ఉంటారు. ఇంట్లోకి వచ్చారు. ఇంతకుముందు మస్కట్ వెళ్ళిన పదిమంది తాలూకు మనుషులు వారు. వారం రోజులక్రితమే పదిమందిని విజా వచ్చిందని బాంబేతోలుకుపోయాడు సత్యం. వారు ఎప్పుడు వెళ్ళింది. లెటర్ ఎప్పుడు వస్తుంది తెలుసుకోవడానికి వచ్చారు. అందరినీ కూర్చోమని చెప్పి స్నానం ముగించుకుని వచ్చాడు సత్యం. అంతవరకూ ఓపికగా కూర్చుని అతడు రాగానే ప్రశ్నలవర్షం కురిపించారు.

సిగరెట్ తాగుతూ వారు అడిగిన ప్రశ్నలకు ఓపికగా సమాధానం ఇచ్చాడు సత్యం. వారిని తనే స్వయంగా ఫ్లైట్ ఎక్కించానని, ఈపాటికి డ్యూటీలో జాయిన్ అయి పని చేసుకుంటూ ఉంటారని వారం పదిరోజుల్లో లెటరు వస్తుందని చెప్పాడు. వారిగురించి ఎలాంటి బెంగ పెట్టుకోకూడదని నొక్కి చెప్పాడు.

"వారు తెల్లగైతే నిన్ను యాదికి చేసుకుంటరు బిడ్డా. ఇక్కడ బతుకలేనివారు ఎవరున్నరు...? వద్దురా అంటే వినకపోయిరి. అందరు సోపతిగూడిమొక్కటే పట్టుపట్టిరి. రెండేండ్లు ఎట్ల తెల్లారాలే... ఎట్ల పొద్దుగూకాలే!" అనుకుంటూ బయటపడ్డారు.

అంతవరకు వంటపనిలో మునిగిపోయిన శ్రీలత వారు వెళ్ళగానే భర్తవద్దకు వచ్చింది. ఆమె మొహం దిగులుగా ఉంది.

"ఈ పాడు దంద మానేయండి. సంపాదించినడబ్బు చాలు. వేరే ఏదైనా పని చూసుకుని బ్రతుకుదాం. మీకు వేరేపని చేయడం ఇష్టంలేకపోతే ఖాళీగా తిని కూర్చోండి. నేను ఏ ప్రైవేటు స్కూల్లో పనిచేసినా పదిహేను వందలిస్తారు" హితవు చెబుతున్నట్టుగా చెప్పింది.

ఆమె వైపు ప్రశ్నార్థకంగా చూసాడు సత్యం. ఏజంట్‌గా పని చేయడం ఆమెకు మొదటినుండి ఇష్టంలేదు. అయినా తన అభిప్రాయాన్ని ఇంతసూటిగా ఎప్పుడూ చెప్పలేదు. ఎవరో ఏదో అని ఉంటారని గ్రహించాడు. అదే విషయాన్ని ఆమెను అడిగాడు. బాధ పడుతునతున్నట్టుగా చెప్పింది శ్రీలత.

"ఎవరనేది ఏముందండీ! ఈ రోజు కొత్తగా అంటున్నారా..?మీరు ఏజంట్‌గా చేరి మొదటి వ్యక్తిని ఫారిన్ పంపడం మొదలుపెట్టిననాడే అనడం మొదలెట్టారు. వెళ్ళినవారేమో జీతం తక్కువుందని వ్రాస్తున్నారు. వెళ్ళనివారేమో ఎన్ని రోజులు తింపుతావని వేధిస్తున్నారు. ఎవరో ఏదో అంటున్నారని కాదు నేను చెప్పేది. మనకు పిల్లలున్నారు. ఎవరు ఏమని శపిస్తున్నారో తెలియదు. మంచి జరిగితే మంచిదే. చెడు జరిగితే మాత్రం మా ఉసురు తగిలిందని నలుగురు నానారకాలుగా అంటారు. అందుకే ఈ పని మానేయమంటున్నాను."

శ్రీలత బాగా హర్టయిందని గ్రహించాడు సత్యం. నాలుగు మంచి మాటలు చెప్పి ఆమెను ఓదార్చాలనుకున్నాడు. ఒక్క మనిషిని ముంబాయిలోని ఏజెంట్‌కు అప్పగిస్తే పదివేల కమిషన్ ఇస్తాడు. మొన్న పదిమందిని అప్పగిస్తే లక్ష రూపాయలిచ్చారు. మనం ఏపని చేస్తే ఇంత డబ్బు సంపాదించగలమో చెప్పు. ఇద్దరు పిల్లల్ని ఇంగ్లీష్ మీడియం రెసిడెన్షియల్ స్కూల్లో చదివిస్తున్నాము. ఇంట్లో టి.వి., ఫ్రిజ్, వి.సి.ఆర్ లాంటి ఆధునిక సౌకర్యాలన్నీ అమర్చుకున్నాం. ఎంతపెద్ద ఉద్యోగం చేస్తే ఇవి సమకూరుతాయి. మన ఊర్లో ఉద్యోగస్తులు, వ్యాపారులు, రైతులు ఉన్నారు. ఎందరు భార్యలకు నీకున్న నగలు, చీరలు ఉన్నాయో చెప్పు." ఆమెను దగ్గరికి తీసుకుంటూ అన్నాడు.

అతడివైపు బాధగా చూసింది శ్రీలత. ఆమె కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి.

"తృప్తిలేని డబ్బు ఎందుకు చెప్పండి. నలుగురు నాలుగు రకాలుగా అంటున్నారు. ఒకరిని పీడించి తీసుకున్న డబ్బు ఎన్నాళ్ళుంటుంది చెప్పండి. మనకష్టం మనం చేసుకుని రెండు పూటలు తిన్నా సరే! అందులో తృప్తి ఉంటుంది. మీ మాటల్ని నమ్మి రెండు సంవత్సరాల్లో లక్షాధికారులమై పోతామనుకుని పుస్తె మట్టెల్ని అమ్మడానికి కూడా వెనుకాడకుండా డబ్బుల్ని మనచేతుల్లో పోస్తున్నారు. ఒవరి ఉసురు మనకెందుకు చెప్పండి" అతడి వైపు సూటిగా చూస్తూ అడిగింది శ్రీలత.

ఆమె మాటలకు దెబ్బతిన్నట్టుగా చూసాడు సత్యం. ఏ విషయాన్నైనా అంతసూటిగా ఇంతవరకూ ఎప్పుడూ మాట్లాడి ఎరుగదు. అప్పుడే ఫోన్ మ్రోగింది. రిసీవర్ ఎత్తి ఒక్క నిమిషం మాట్లాడి ఫోన్ పెట్టేసి శ్రీలత వద్దకు వచ్చాడు.

"లతా! డబ్బు విలువ నీకు తెలియదు. ఈ మాత్రం రిస్క్ తీసుకోకపోతే ఎలా...? ఏ వృత్తి చేపట్టినా అందులో సాదక బాధకాలుంటాయి. అలాగని చేసేపనిని మానుకుంటామా....? నేను ఉద్దేశ్యపూర్వకంగా ఎవరినీ మోసం చేయడం లేదు. ముంబాయిలోని ఏజంట్ నాకెలా చెబితే నేను వీరికి అలా చెబుతున్నాను. జీతం, పని ఎవరి అదృష్టం ఎలా ఉంటే అలాగే దొరుకుతుంది.

"నేను ఫారిన్ పంపించిన వారిలో లక్షాధికారులైనవారు ఉన్నారు. నాంపల్లిగాడు అరబ్బుదాన్ని చేసుకుని షేక్ అయిపోయాడు. సాకలి సాయిలు కరీంనగర్‌లో బంగ్లా కట్టి ఫ్లాట్‌లు కూడా కొన్నాడు. వీరు నాకేమైనా ఇస్తున్నారా? ఎంత సంపాదిస్తరన్నది వారి వారి అదృష్టం. అక్కడికి పంపడమే నా బాధ్యత."

అప్పుడే బయటనుండి పిలుపు వినిపించింది. ఏదో చెప్పబోతున్న శ్రీలత ఆగిపోయి కళ్ళను తుడుచుకుంది. సత్యం బయటకు వచ్చి చూసాడు. ఎదురుగా దూరపు బంధువు ముత్తయ్య. సత్యం చూడగానే పలకరింపుగా నవ్వాడు.

"ముత్తయ్య బావా.....లోపలికిరా. బయటనే నిలబడ్డావేంటీ...? ఎప్పుడొచ్చావు?" లోపలికి ఆహ్వానిస్తూ అడిగాడు సత్యం.

"ఇప్పుడే వస్తున్నా.....అంత బాగున్నారా! కాలం ఇటు దిక్కుకూడా కానట్టేఉంది. బస్సులో నుండి చూసాను. అన్ని బీడుభూములే కనిపించాయి." లోపలికి వచ్చి కూర్చుంటూ అన్నాడు ముత్తయ్య.

"ఏం కాలమో ఏమో! వానాకాలం ఎండకాలమైంది. ఎండకాలం చలికాలమైంది. మగదాటి పోయినా ఒక్కవాన కూడా పడలేదు. అయినా కాలం కాలేదనిరంది ఎవరికుంది. అందరు మీద

మీద తిరుగుడుకు అలవాటుపడిపోయారు. కష్టపడి పనిచేసుకోవాలన్న ఆలోచనలేదు. ఎంతసేపూ తేలిగ్గా డబ్బు ఎలా సంపాదించాలనే ఆలోచిస్తారు." అతడి పక్కనే కూర్చుంటూ అన్నాడు సత్యం.

శ్రీలత బయటకు వచ్చి పలకరించి క్షేమ సమాచారాలు తెలుసుకుంది. తర్వాత టీ తీసుకు రావడానికి వంటింట్లోకి వెళ్ళింది.

కొద్దిసేపు కుటుంబ విషయాల తర్వాత ముత్తయ్య తనకొడుకు గురించి చెప్పాడు. చదువు కొమ్మంటే చదువుకోలేదని, వ్యవసాయం కూడా చేయడంలేదని చెప్పాడు. చెప్పినా వినకుండా యువజన సంఘం స్థాపించాడని పెద్దమనుషులందరికీ ఎదురు తిరిగాడని చెప్పారు.. ఆ కక్షతోనే నక్సలైట్లతో సంబంధం ఉందని పెద్ద మనుషులందరు కలిసి పోలీసులతో కొట్టించారని బాధ పడుతూ చెప్పాడు. స్టేషన్ నుండి బయటకురావడానికి పాతిక వేలు ఖర్చయ్యాయని చెప్పాడు.

"అరే...అంతపనైపోయిందా...? చదువులో కూడా చురుగ్గా ఉండే వాడుకదా! ఇప్పుడు మంచిగున్నడా...?" జాలిగా చూస్తూ అడిగాడు సత్యం. శ్రీలత రెండు టీ కప్పులతో వచ్చింది. కప్పును అందుకుని తాగుతూ భయం భయంగా చెప్పాడు ముత్తయ్య." ఇప్పుడు బాగానే ఉన్నాడు. ఇకముందు ఏం జరుగుతుందోనని భయంగా ఉంది. అసలే వాడు పోలీసోల్ల కంట్లో పడ్డాడు."

సత్యంకు అతడి ఉద్దేశ్యం అర్థమైపోయింది. టీ త్రాగుతూ మౌనంగా ఉండిపోయాడు. ముత్తయ్య కూడా మౌనంగా ఉండిపోవడంతో కదిలించింది శ్రీలత.

"ఇంట్లో ఉంచకూడదు. ఎక్కడికైనా పంపించాలి. ఏరాత్రో పగలో మళ్ళీ వచ్చి పట్టుకుపోతారు. హితవు చెబుతున్నట్టుగా అన్నది. మాట్లాడడానికి అవకాశం దొరికింది ముత్తయ్యకు. వెంటనే అందుకున్నాడు. "ఎక్కడికి పంపాలి చెల్లీ! ఎటుపంపినా నెల రెండు నెలలు ఉండనిస్తారు. యాడాదుల కొద్ది ఏ చుట్టాలు ఉంచుకుంటరు...? సత్యంను కలిసి మస్కట్ తోలిద్దామని వచ్చాను."

నవ్వుతూ జేబులోనుండి పాస్‌పోర్ట్‌ను సత్యంకు అందించాడు. దానిని ఒకసారి తిరిగేసి టేబుల్‌పై ఉంచాడు సత్యం. అప్పుడే 'సత్తన్నా ఉన్నావా...?' అంటూ ఇద్దరు వ్యక్తులు వచ్చారు. సత్యం చూడగానే వారి మొహం దివ్వెలా వెలిగిపోయింది.

"అన్నా......గుడిలో దేవుడి దర్శనమైనా అయితది కానీ నీ దర్శనమైతలేదు. తిరిగి తిరిగి కాళ్ళు అరుగవట్టె" అంటూ అతడి వద్దకు వెళ్ళారు. వారు పక్కగ్రామంనుండి వచ్చారు. ఇంతకు ముందు వారి గ్రామం నుండి ఇద్దరు వ్యక్తుల్ని మస్కట్ పంపించాడు సత్యం. వీరు వారి యొక్క బంధువులే. చర్చ విజాల గురించి సాగింది. వారిద్దరూ పాస్‌పోర్ట్‌లు పదివేల రూపాయల అడ్వాన్స్ ఇచ్చి వెళ్ళారు. నెలరోజుల్లో విజా తెస్తానని వారికి భరోసా ఇచ్చాడు సత్యం.

రిమోట్‌తో టీ.వి. ఆన్‌చేసి ముత్తయ్య పక్కన కూర్చున్నాడు సత్యం. మాటల మధ్యలో వారి సంభాషణ డబ్బువైపు మళ్ళింది. 'ఒక్కక్కరికి ఎంత తీసుకుంటున్నావని' అడిగాడు ముత్తయ్య.

"మెడికల్ ఖర్చులు, బస్సుకిరాయిలు కాక అరవై వేయిల రూపాయలు తీసుకుంటున్నాను. పాస్‌పోర్ట్ ఇచ్చేప్పుడు పదివేల అడ్వాన్స్ ఇవ్వమంటున్నాను. విజా వచ్చిన తర్వాత యాభైవేలు" వివరంగా చెప్పాడు సత్యం.

"నీకు ఇందులో కమీషన్ ఎంత ఉంటుందోయ్" నవ్వుతూ అడిగాడు ముత్తయ్య.

విరక్తిగా పెదవి విరుస్తూ చెప్పాడు ముత్తయ్యతో సత్యం "ఎక్కడిది బావా...ఒక వ్యక్తికి ఒక వెయ్యి మిగిలితే ఎక్కువాయే. అసలుకు ఎవడైనా బ్రతిమాలి తక్కువ పెడితే అవి కూడా మిగలవు. ఈ డబ్బులు నేను ముట్టను కూడా ముట్టను. వారితోనే డి.డి. తీయించి బొంబాయి వెళ్ళినంక ఆఫీసులో ఇవ్వుమంట."

అతడు అబద్దం చెబుతున్నాడని గ్రహించాడు ముత్తయ్య. అతడు అలా గ్రహించాడని సత్యం కూడా గ్రహించాడు. తనకొడుకు గురించి ఏదైనా చెబుతాడేమోనని ఎదురు చూసాడు ముత్తయ్య. అతడే చెబుతాడేమోనని సత్యం చూసాడు. బందుత్వపుమాట. డబ్బు దగ్గర ఒత్తిడి చేయరాదు. అందుకే పెదవి విప్పడం లేదు సత్యం. వారి మౌనాన్ని చేదిస్తూ ఫోన్ మ్రోగింది. శ్రీలత ఎత్తి సత్యంని పిలిచింది.

అది బాంబే ఆఫీసునుండి వచ్చిందని తెలియగానే సత్యం మొహం చిరునవ్వుతో నిండి పోయింది. ఐదు విజాలు రెడీ అయ్యాయని వెంటనే వ్యక్తుల్ని డబ్బుతో సహా తీసుకురమ్మని అందులో సారాంశం. ఎగిరిగంతువేసాడు సత్యం. ముత్తయ్యను ఆరోజు అక్కడే ఉండుమని మిగతా విషయాలు తర్వాత మాట్లాడుకుందామని చెప్పి బయటకు నడిచాడు సత్యం.

అతడు బయటకు వెళ్తే ఏ రాత్రో కానిది ఇంటికి చేరడని శ్రీలతకు తెలుసు. అందుకే భోజనం చేసివెళ్ళుమని బలవంతం చేసింది. ఆ ఆనందంలో అన్నం సహించలేదతనికి. అరగంటలో తిరగి వస్తానని చెప్పి వెళ్ళిపోయాడు. రాత్రి పదిగంటలవరకూ తిరిగి రాలేదు. ముత్తయ్య అంతవరకూ ఎదురు చూసి శ్రీలత బలవంతం మీద భోజనం చేసి పడుకున్నాడు.

ఎవరిపైనో మండిపడుతూ ఇంట్లోకి అడుగుపెట్టాడు సత్యం. అతడి మొహం పీక్కుపోంఎ ఉంది. మనిషి టెన్షన్‌గా ఉన్నాడు. ఆందోళనగా ఏం జరిగిందని అడిగింది శ్రీలత.

"మొదట ఒకమాట అంటరు. తర్వాత మరో మాట అంటరు. ఈ వెర్రి జనంతో ఇదే పరేశాను. మొదట కాళ్ళా వేళ్ళా బతిమాలిండ్రు. ఇప్పుడు విజా వచ్చిన తర్వాత డబ్బులు కావు. మేము వెళ్ళము అంటున్నారు. ఇలా అబద్దమాడి ఎవడి కొంప ముంచుతారు. ఇటువంటి వాళ్ళు పాస్‌పోర్ట్ ఎందుకు ఇవ్వాలి." పెద్దగా అరుస్తూ డైనింగ్ టేబుల్ ముందు కూర్చున్నాడు సత్యం. శ్రీలతకు పొద్దున ముంబాయినుండి వచ్చిన ఫోన్ కాల్ గుర్తుకు వచ్చింది. భర్త ఎన్నడూ అంత టెన్షన్‌గా కనిపించలేదు. జరగరానిదేదో జరిగిపోయిందని గ్రహించింది. భోజనం వడ్డిస్తూ ఎవరని అడిగింది.

"మొన్న ఒకనాడు కూరుకురాత్రి రాలేదా గొల్లోల్లు...? ఏడుస్తూ మిడుకుతూ ఐదుగురు పాస్‌పోర్ట్‌లు ఇచ్చి వెళ్లారు. అడ్వాన్స్ ఇవ్వుమంటే కాళ్ళ వేళ్ళపడి బ్రతిమాలి మొత్తం డబ్బు విజా వచ్చిన తర్వాత ఇస్తామనిరి. ఏదో గరీబుగాల్లు బతుకని అని నేను విజా కొరకు ప్రయత్నిస్తే, తీరా వచ్చాక డబ్బు మాకు ఎక్కడా పుట్టదు మేము వెళ్ళం అంటున్నారు ఒక్కడు కాదు, ఐదుగురు అదేపాట." బాధపడుతూ చెప్పాడు సత్యం.

ఆ అలికిడికి ముత్తయ్యకు మెలకువ వచ్చింది. లేచి వచ్చి ఏం జరిగిందని ఆరాతీసాడు. జరిగిన విషయం చెప్పాక వారికి బదులుగా వేరే వ్యక్తుల్ని తోలివ్వమని సలహా ఇచ్చాడు. అది గ్రూపు విజా కాదని పేరు విజా అని అలా చేయడం కుదరదని ఒక్కొక్కరివలన ఇరవై అయిదు

వేల చొప్పున మొత్తం లక్షా ఇరవై ఐదు వేల రూపాయల నష్టమని చెప్పాడు. అన్నం సహించక అర్థాంతరంగానే చేయి కడుక్కున్నాడు. ముత్తయ్య తనకొడుకు విషయం అడగాలనుకున్నాడు. అతడు బాధపడటం చూసి అడగలేకపోయాడు. శ్రీలత కూడా అర్థాంతరంగానే భోజనాన్ని ముగించి వంటిల్లను సర్దుకుని బెడ్‌రూంలోకి చేరుకుంది.

"నిజంగా మనకి లక్షా ఇరవై అయిదు వేల రూపాయలు నష్టం వచ్చిందంటారా...?" అనుమానంగా అడిగింది భర్తని.

"అవును లతా. ఒక మనిషిని పంపిస్తే వారికి ఇరవై ఐదు వేయిల రూపాయలు మిగులుతాయి. అందులో నుండి నాకు పదివేలు కమిషన్ ఇచ్చి వాళ్ళు పదిహేను వేలు తీసుకుంటారు. మన కమిషన్ పోగా ఈ లెక్కన వారికి తొంభై వేయిలు అయితే తప్పకుండా చెల్లించాలి. లేదంటే మరోసారి ఆఫీసు గుమ్మం తొక్కనివ్వరు." బాధపడుతూ చెప్పాడు సత్యం.

తాము అంతడబ్బును పోగొట్టుకున్నందుకుకాదు - వ్యక్తుల్ని నమ్మించి మధ్యవర్తులు ఎంత డబ్బును పంచుకుని పేదవాడి కన్నీటికి కారణమౌతున్నారో తలచుకొని బాధ పడింది శ్రీలత. తన అభిప్రాయాల్ని సూటిగా చెబితే అతడు కోపగించుకుంటాడని పరోక్షంగా చెప్పింది.

"ఇప్పుడు బాధపడి ఏం చేస్తారు చెప్పండి. మొన్న పంపిన పది మంది కమిషన్ అటే ఇచ్చి వేయండి. ఇప్పటికైనా ఈ పని మానివెయ్యండి. ఎప్పుడు లాభం వస్తుందో ఎప్పుడు నష్టం వస్తుందో తెలియదు. ఎందుకీ టెన్షన్. ఎందుకీ బాధ. అవసరమైతే నా నగలు ఇస్తాను. అమ్మివేసి ఆ ఏజెంటుకు ఇవ్వండి." నడుం వాలుస్తూ చెప్పింది.

ఆమె వైపు వెర్రిదానిని చూసినట్టుగా చూసి నవ్వాడు సత్యం. "పిచ్చిదానా. ఎలుకల కొరకు ఇల్లుకు నిప్పుపెట్టుకుంటారే! డబ్బు ఎక్కడ పారేసుకున్నామో అక్కడే వెదుక్కోవాలి. ఇంకో పదిమందిని తయారుచేస్తాను. నెలరోజుల్లో ఈ నష్టాన్నీ పూడ్చేస్తాను. పదివేలు ముందుగానే అడ్వాన్స్ తీసుకుంటాను." చెప్పి నిద్రకుపక్రమించాడు సత్యం. అతడు మారడని అర్థమైపోయింది శ్రీలతకు. దిగులుగా నిద్రలోకి జారుకుంది. నిద్రలో పీడకల వచ్చింది.

గొల్లవారు ఐదుగురు వ్యక్తులు విజా వచ్చినా వెళ్ళడం లేదని తెల్లవారకముందే ఊరంతా తెలిసిపోయింది. నలుగురు నాలుగురకాలుగా అంటున్నారు. వారికొరకు తనెంత కష్టపడింది వర్ణించి చెప్పటం మొదలెట్టాడు సత్యం. ఊర్లో అతడి పట్ల విశ్వాసం సానుభూతి మరింత పెరిగాయి. ఐదుగురు వ్యక్తులు మొహం చాటేసారు. ఊరిలోకి రావడం మానేసారు.

వారు వెళ్ళక పోవడానికి బలమైన కారణం ఉంది. సత్యం ఇంతకు ముందు పంపించిన చాలా మంది వ్యక్తుల ఇండ్లలోకి వెళ్ళి తెలుసుకున్నారు. నెలకు మూడు వేల కంటే ఎక్కువ జీతం ఎవరికీ లేదని తెలిసిపోయింది. ఆ లెక్కన మూడు సంవత్సరాలు భార్యా బిడ్డలకు దూరంగా వెళ్ళినా అసలు వడ్డీ తీరదని అర్థమైపోయింది. అందుకే ఐదుగురు కూడబలుక్కుని వెళ్ళకూడదని నిర్ణయించుకున్నారు. ఈ విషయం ఎవరితో చెప్పలేదు వారు.

రెండు రోజులు కాలికి బట్టకట్టకుండా తిరిగాడు సత్యం. ముత్తయ్య కొడుకును కూడా తోలిస్తానని హామీ ఇచ్చాడు. పాస్‌పోర్ట్‌తో పదివేలు తప్పకుండా ఇవ్వాలని కండీషన్ పెట్టాడు. మొహం మాడ్చుకుని వెళ్ళిపోయి కొడుకుతో డబ్బును పంపించాడు ముత్తయ్య. ఊరిలో మరో

తొమ్మిది మందిని రెడీ చేసాడు. పాస్‌పోర్ట్‌ల అడ్వాన్స్‌లు తీసుకున్నాడు. డబ్బు పాస్‌పోర్ట్‌లతో ముంబాయి బయల్దేరాడు. అతడిని వారించాలని చూసి విఫలమయిపోయింది శ్రీలత.

పదిహేను రోజులు ఇంటిమొహం చూడలేదు సత్యం. శ్రీలత కంగారు పడితుందని రెండు మూడు రోజులకొక సారి మాత్రం ఫోన్ చేసేవాడు. పదహారవనాడు పదిహేను విజాలతో ఇంటికి చేరుకున్నాడు. రెండు రోజుల్లో మరో ఐదుగురిని తయారు చేసాడు. అందరికి విజా జీరాక్స్ కాగితాలు ఇచ్చి వారం రోజుల్లో డబ్బు రెడీ చేసుకోమని చెప్పాడు. ఊరంతా అట్టుడికినట్టుగా మారిపోయింది. ఎక్కడ చూసినా సత్యం విషయమే చర్చకు వచ్చింది. అతడిని దేవుడితో పోల్చడం మొదలెట్టారు.

అనుకున్నట్టుగా అందరూ డబ్బు రెడీ చేసుకున్నారు. నగలు, పొలాలు అమ్ముకున్నారు. లేనివారు కాళ్ళావేళ్ళాపడి అప్పు తెచ్చుకున్నారు. ఒకరోజు అందరినీ బేంక్‌కు తీసుకువెళ్ళి డి.డి.లు తీయించాడు. బస్‌లో సీట్లు రిజర్వు చేయించాడు సత్యం. పదిహేనుమందితో వస్తున్నట్టు ముంబాయికి ఫోన్ చేసాడు.

వారు బయల్దేరేనాడు ఊరేగింపులా సాగింది ప్రయాణం. వెళ్ళేవ్యక్తుల తాలూకు బంధువులు, కుటుంబ సభ్యులు వెంటరాగా బస్‌స్టేషన్ చేరుకున్నాడు సత్యం. ఏడ్పులు, ఓదార్పులు, అప్పగింతలు పూర్తయ్యాక ముంబాయి బస్ కదిలింది. తృప్తిగా ఊపిరిపీల్చుకున్నాడు సత్యం.

సత్యం ముంబాయి వెళ్ళిన మరునాడే మొదట వెళ్ళిన పదిమందికి మస్కట్ నుండి ఉత్తరాలు వచ్చాయి. సత్యం తమను మోసం చేసాడని ఇక్కడ కంపెనీ తిండి పెట్టడం లేదని జీతం రెండు వేలు మాత్రమే ఉందని. ఇది ఫ్రీగాతోలే కంపెనీ అని ఇరవై వేలు కూడా ఖర్చుకాదని వ్రాసారు. కొందరు ఆ జీతం సరిపోదని తిరిగివస్తున్నామని వ్రాసారు. మరి కొందరు సత్యంతో సామరస్యంగా చర్చించి తమ డబ్బులు వాపసు తీసుకోవాలని వ్రాసారు. సత్యం ఇంటికి కూడా ఉత్తరాలు వచ్చాయి. జనం అతడి ఇంటిముందు క్యూకట్టారు. అందరినీ సముదాయించలేక బావురు మంది శ్రీలత. విషయమంతా భర్తతో ఫోన్‌లో చెప్పింది. దిగులు పడవద్దని తను వీలైనంత తొందరలో వస్తున్నానని ఫోన్‌లో ధైర్యం చెప్పాడు సత్యం.

వారం రోజులు గడిచాయి. అట్టహాసంతో ముంబాయి వెళ్ళిన పదిహేను మంది వాడిపోయిన మొహాలతో ఇల్లు చేరుకున్నారు. ఇంకా విజాలు రెడీ కాలేదని సత్యం తమను తొందర పెట్టాడని చెప్పారు. అన్నీ సిద్ధం అయ్యేసరికి నెలరోజులు పడితుండవచ్చునని డి.డి.లు కంపెనీ వారే తీసుకున్నారని చెప్పారు. విజాలు రెడీ చేసుకుని సత్యం వస్తాడని తమను తీసుకువెళ్తాడని బెంగ పడుతున్న కుటుంబ సభ్యులను సమాధానపరిచారు.

మస్కట్ వెళ్ళిన వారినుండి మరోసారి ఉత్తరాలు వచ్చాయి. సత్యం డబ్బులు వాపసు ఇస్తానంటున్నాడే లేదా అని వ్రాసారు. ఈ జీతంతో జీవితాంతం ఇక్కడ ఉన్నా మిత్తి కూడా తీరదని డబ్బు వాపసు ఇవ్వడానికి సత్యం నిరాకరిస్తే తాము ఇక్కడే ఆత్మహత్య చేసుకుంటామని వ్రాసారు. వారి కుటుంబాలు గొల్లుమన్నాయి. శాపనార్థాలు పెట్టడం మొదలెట్టారు. ఎప్పుడు ముంబాయి నుండి వస్తే అప్పుడే నిలదీసి అడగాలని రెడీగా ఉన్నారు. ఇదంతా గమనించి ముంబాయి నుండి తిరిగివచ్చిన వ్యక్తులు తాము మస్కట్ వెళ్ళమని తమ డబ్బులు తమకు వాపసు తీసుకురమ్మని శ్రీలతతో చెప్పారు.

అయోమయంలో పడిపోయింది శ్రీలత. సమస్య ఎంత జటిలంగా తయారయిందో గుర్తించింది. వెళ్ళిన పదిమంది డబ్బు వాపసు ఇవ్వాలంటున్నారు. వాళ్ళపరంగా ఆలోచిస్తే అది నిజమేననిపిస్తుంది. తెలిసినవాడని చెప్పిన మాటల్ని నమ్మి గంపెడు ఆశతో దేశంగాని దేశం వెళ్తే వడ్డీకి సరిపడా జీతం దొరక్కపోతే ఎవరు మాత్రం ఏం చేస్తారు అనుకుంది. కానీ ఆ డబ్బు ఒక్కడే తీసుకున్నది కాదు. ఎవరెవరికి ఎంత వాటా ఉన్నదో తెలియదు. అదంతా ఒక్కడే ఇవ్వాలంటే ఎలా...?

కనీసం కొత్తగా వెళ్ళే పదిహేను మందికైనా విజాలు తేరాదని విషయాన్నంతా వివరించి చెప్పాలని ముంబాయికి ఫోన్‌చేసింది శ్రీలత. ఫోన్‌ను ఎవరూ ఎత్తడం లేదు. మరో నెంబరుకు ట్రై చేసింది. ఫోన్ ఎత్తగానే సత్యంతో మాట్లాడాలని చెప్పింది. రెండు నిమిషాల తర్వాత సత్యం లైనులోకి వచ్చాడు. అతనిగొంతు నీరసంగా వినిపించింది. ఇక్కడి పరిస్థితి అంతా వివరించకముందే అక్కడి పరిస్థితిని చెప్పాడు.

"అంతా అయిపోయింది లతా...! డి.డీలు తీసుకుని డబ్బులు డ్రా చేసుకుని కంపెనీవాడు పారిపోయాడు. ఏ మొహం పెట్టుకుని ఇంటికి రావాలో తెలియటంలేదు. విజాలు వచ్చాయని వారిని తీసుకురమ్మని వచ్చాను. వారికి ఏం సమాధానం చెప్పాలో అర్థం కావడం లేదు. వీడు నన్ను ఇంత మోసం చేస్తారనుకోలేదు. మొన్నటి బ్యాచ్‌ను అతి తక్కువ ఖర్చుతో ఫ్రీ విజాలమీద తక్కువ జీతం ఉండే కంపెనీకి పంపించాడట. ఆ విషయంలో కూడా నన్ను మోసం చేసాడు." ఏడుస్తున్నట్టుగా ఉంది అతనిగొంతు.

ఫోన్ పెట్టేసి బావురుమంది శ్రీలత. క్షణాల్లో ఊరంతా పాకిపోయింది ఈ విషయం. ఇదంతా సత్యం ఆడుతున్న నాటకమని కొట్టిపారేసారు అందరూ. ముందటి బ్యాచ్ వారికి డబ్బులు ఇవ్వాల్సి వస్తుందన్న నెపంతో ఈ ప్రచారం మొదలెట్టాడని విరుచుకుపడ్డారు. ఇంటిలోకి వెళ్ళి శ్రీలతను దుర్భాషలాడారు. విషయం ఊరూరికి పాకిపోయింది. శ్రీలత తల్లి దండ్రులు, అన్నలు వచ్చారు. ఇంటికి తాళం వేసి తమతో రమ్మని చెప్పారు. ఒప్పుకోలేదు శ్రీలత.

ముంబాయి ఫోన్ చేసింది. భర్తతో ఊరికి రమ్మని చెప్పింది. వస్తే ఏం జరుగుతుందో తెలిసే ఈ మాట అంటున్నావా.....? అన్నాడు సత్యం దిగులుతో. తన నిర్ణయాన్ని చెప్పింది శ్రీలత. అరిచినట్టుగా శ్రీలతా....'అంటూ అలా చేయవద్దని తను ఎలాగైనా ఏజెంట్‌ను పట్టుకుని డబ్బు వాపసు తెచ్చి వారికి ఇస్తానని చెప్పాడు. తన నిర్ణయం మారదని గట్టిగా చెప్పి ఫోన్ పెట్టేసి తండ్రివైపు తిరిగి చెప్పింది శ్రీలత దృఢంగా.

"నాన్నా.......వారు కన్నీరు మున్నీరుగా ఏడుస్తుంటే నేను చూడలేను. ఇండ్లు, పొలాలు అమ్ముకుని అతడిని నమ్మి డబ్బులు ఇచ్చారు. నేను చేతులెత్తేసి ఊర్కుంటే నన్నెవరూ ఏమీ చేయలేరు కానీ ఒక ఆడదానిగా సాటి ఆడవాళ్ళ వేదనని అర్థం చేసుకుని చెబుతున్నాను. నానగలు, ఇంట్లో సామాను, పొలం, ఇల్లు అన్నీ అమ్మేసెయ్. ఎవరి డబ్బులు వారికి ఇచ్చెయ్. జీతం తక్కువుందని వ్రాసారు కదా వారు. వారికి సగం డబ్బు ఇచ్చెయ్. నేను కష్టం చేసుకుని నా పిల్లల్ని పోషించుకుంటాను. ఈ అప్పు తీర్చేస్తేనైనా నిర్భయంగా అతడు ఊరిలోకి అడుగుపెడతాడు.

సర్వస్వం కోల్పోతున్నా, కూతురు మొహంలోని ఆత్మవిశ్వాసాన్ని చూసి ధైర్యంగా ముందుకు కదిలాడు ఆమెతండ్రి.